లైంగిక దాడి కేసులో కటకటాల్లోకి ఆస్పత్రి కాంపౌండర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో జ్వరంతో బాధపడుతున్న యువతికి మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి చేసిన కేసులో నిందితుడైన కాంపౌండర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. క్షేత్రస్థాయి విచారణ చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలూ సేకరించారు. ఆ దారుణ ఘటనలో ఆస్పత్రి నిర్లక్ష్యం తేలితే తగిన చర్యలకు సంబంధిత శాఖకు నివేదిక పంపుతామని కరీంనగర్ సిపి గౌలం ఆలం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో జరిగిన అమానుష ఘటన ప్రధాన చర్చనీయాంశంగా మారింది. జ్వరంతో బాధపడుతున్న యువతిని ఆమె తల్లిదండ్రులు ఈనెల 6న తేదీన ఈ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, రాత్రి విధుల్లో ఉన్న కాంపౌండర్/ ఒటి టెక్నీషియన్ పెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తి యువతికి మత్తుమందు ఇచ్చి లైంగికదాడికి ఒడిగట్టాడు. మత్తు నుంచి కోలుకున్న బాధితురాలు తన తండ్రికి విషయం చెప్పడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆస్పత్రిలో సాక్షులను విచారించడంతో పాటు, సాంకేతిక ఆధారాలు సేకరించారు. ఈనెల 8న నిందితుడు దక్షన్‌మూర్తిని అరెస్టు చేశారు. ఇంటర్మీడియట్ (బైపిసి) చదివిన నిందితుడు, నాలుగేళ్ల కిందట కరీంనగర్ వచ్చి వేర్వేరు ఆస్పత్రుల్లో పనిచేశాడు. తరచూ మద్యం సేవించి డ్యూటీకి రావడం వల్ల గతంలో పని చేసిన చోట అతడిని తొలగించినట్టు పోలీసులు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడటానికి కూడా అతడు చెడు అలవాట్లు కారణంగా గుర్తించారు. ఈ కేసులో ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే సంబంధిత అధికారులకు నివేదిక పంపి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

వాస్తవాలను వక్రీకరిస్తే తిరుగుబాటు తప్పదు

- నిజాం.., ఆర్‌ఎస్‌ఎస్ ఒక్కటే..
- బలవంతంగా ఏ భాషనూ రుద్దొద్దు
- భువనగిరిలో సదస్సులో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు


మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం నాడు తెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాటం ద్వారా ఈ ప్రాంత ప్రజలు స్వేచ్ఛను పొందారు.. ఎన్నో ప్రజావిజయాలు సాధించారు.. కానీ నేడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆ పోరాట వాస్తవాలను వక్రీకరిస్తున్నాయి.. అలా చేస్తే తిరుగుబాటు తప్పదు' అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని దివ్య ఫంక్షన్‌హాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ అధ్యక్షతన 'వీరతెలంగాణ సాయుధ రైతాంగ విప్లవ పోరాటం.. ప్రజా విజయాలు, వాస్తవాలు, వక్రీకరణలు' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడారు. తెలంగాణ సాయుధ విప్లవ పోరాటంలో ఎందరో మహానుభావులు అసమాన ధైర్యసాహసాలు, తాగాలు చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలు నేడు కొంతైనా మెరుగైన జీవితం గడుపుతున్నారంటే నాటి ఆ పోరాటమే కారణమని చెప్పారు.

నిజాంకు జమీందారులు, జాగీర్దారులు, దేశ్‌ముఖ్, పటేళ్లు, పట్వారీలు ఊడిగం చేశారన్నారు. వీరి దౌర్జన్యాలు పరాకాష్టకు చేరడం వల్లే తెలంగాణ సాయుధ పోరాటం ఆవిర్భవించిందని చెప్పారు. ప్రస్తుతం వీరంతా లేకున్నా చిన్న స్థాయి జమీందారులు మాత్రం ఉన్నారన్నారు. తెలంగాణ ప్రాంతం అభివృద్ధి వెనుక 4000 మంది సాయుధ పోరాట అమరవీరుల రక్తంతో తడిసిన త్యాగాలు ఉన్నాయన్నారు. నాటి నిజాం, నేటి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఫాసిస్ట్ విధానాలు ఒక్కటేనని వివరించారు. అప్పట్లో కమ్యూనిస్టులు ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా గ్రామాల్లో రాత్రి పూట వయోజన పాఠశాలలు నడిపారని గుర్తు చేశారు. ఎందరో కళాకారులు సుద్దాల హనుమంతు, దాశరథి, సినారె లాంటివారు ఉద్యమాలలో పాలుపంచుకున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఈ పోరాటాన్ని వక్రీకరిస్తూ హిందూ, ముస్లిం వివాదంగా మార్చడానికి యత్నిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ పోరాటాలపై తప్పుడు వక్రీకరణలు చేస్తే ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. తెలంగాణ రైతాంగ సాయుధ విప్లవ రైతాంగ పోరాట వీరుల త్యాగాన్ని వృథా కానివ్వొద్దన్నారు.

దేశంలో పాలకులు ఓటర్ లిస్టులను తారుమారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీలు, ఆడవారు, తమకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారి పేర్లు తీసేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, లంచం, కులం, మతం పేరిట గెలవాలని చూస్తున్నారని వివరించారు. కానీ నేటికీ దేశం ఐక్యతగా ఉండటానికి కారణం ఫెడరల్ వ్యవస్థ అని, అలాంటి ఫెడరల్ వ్యవస్థను కాలరాస్తున్నారని తెలిపారు. కేంద్రం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ దేశవిచ్ఛిన్నానికి కృషి చేస్తోందన్నారు. రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో తీసుకుంటున్న డబ్బును తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇటీవల ప్రధాని మోడీ ఆడవారు ఇంటికే సేవలు అధికంగా చేయాలనడం ఆయనలో ఉన్న ఫాసిస్టు విధానాలకు తార్కాణమన్నారు. చైనాలో వందమంది మహిళల్లో డెబ్బై మంది దేశ అభివృద్ధిలో.. కుటుంబ పోషణతోపాటు ఆర్థికంగా సంపాదించే బాధ్యతలు, విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. మన దేశంలో 14 మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు.

సిపిఎం సీనియర్ నాయకులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, నిజాంపై పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర లేదన్నారు. తెలంగాణ చరిత్రను, అమరుల త్యాగాలను చదవాలని సూచించారు. కేంద్రానికి భయపడితేనో లేక పుష్పగుచ్ఛాలు, శాలువాలతో మచ్చిక చేసుకుంటేనో సమస్యలు పరిష్కారం కావన్నారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డి అర్థం చేసుకోవాలన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జి.శ్రీనివాస్‌చారి, నాయకులు గూడూరు అంజిరెడ్డి, మాయకృష్ణ పాల్గొన్నారు.

కేంద్రం సరిపడా యూరియా సరఫరా చేయాల్సిందే

- ఈనెల 11న రాష్ట్ర వ్యాప్త ధర్నాలు
- పోస్టర్ ఆవిష్కరణలో టి.సాగర్ పిలుపు



ఆదివాసీ సంస్కృతిక సంచికను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడినంత యూరియాను సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. అందుకు కారణమైన కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, అరిబండి ప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెల రోజులుగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అనేక జిల్లాల్లో సహకార సంఘాలు, డీలర్ షాపుల దగ్గర రైతులు బారులు తీరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు సకాలంలో ఎరువులు వేయకపోతే దిగుబడి తగ్గే అవకాశముందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అనేక మంది డీలర్లు 45 కిలోల బస్తాకు రూ. 242 తీసుకోవాల్సి ఉండగా, అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియా, ఎరువులను సరఫరా చేయలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రసాయన ఎరువులను తగ్గించడం, క్రమంగా సబ్సిడీకి కోత విధిస్తున్నదని విమర్శించారు. నానో యూరియాను రైతులకు బలవంతంగా అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నదని తెలిపారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన యూరియాను కూడా సరైన ఇండెంట్ పెట్టడం లేదని విమర్శించారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే యూరియా, ఎరువులను అందుబాటులో లేకుండా చేస్తున్నదని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగిస్తే గతంలో శ్రీలంకలో వచ్చిన మాదిరిగా మనదేశంలోనూ ఆహార సంక్షోభం వచ్చే పరిస్థితులు వస్తాయన్నారు. పంటల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి కేటాయించిన యూరియాను ప్రణాళిక బద్ధంగా పంపిణీ చేయడంలో కూడా విఫలమైందని విమర్శించారు.

కేన్సర్.. ప్రాణాంతకం

- సంవత్సరానికి 55 వేల కేసులు నమోదు
- రాష్ట్రంలో 34 కేన్సర్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు
- జర్మనీ, జపాన్ కొలబ్రేషన్‌తో ఎంఓయు
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేన్సర్ ప్రాణాంతక వ్యాధి అని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలోని 34 జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కేన్సర్ డే కేర్ సెంటర్లను మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ నుంచి వర్చువల్‌గా మంత్రి దామోదర్ ప్రారంభించారు. రాష్ట్రంలోని నర్సింగ్ కాలేజీల్లో చదివే విద్యార్థులు జర్మనీ, జపాన్ లాంటి విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు వీలుగా ఇంగ్లీష్‌పై పట్టుసాధించేలా ఇఫ్లూ (ఇంగ్లీష్ ఫారిన్) యూనివర్శిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రాణాంతమైన కేన్సర్ వ్యాధిని నివారించడం కోసం సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, పేదవారికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కేన్సర్‌పై గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన లేకపోవడంతో సమయానికి చికిత్స తీసుకోవడం లేదని, దాంతో చికిత్స తీసుకునేందుకు వచ్చే సమయానికి రెండో దశ, మూడో దశ దాటిపోతుందన్నారు. కేన్సర్ వ్యాధిని నివారించడం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో కేన్సర్ డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కొక్క కేర్ సెంటర్‌లో 20 బెడ్లు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఏడాది రాష్ట్రంలో 55 వేల మంది కేన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని, వచ్చే సంవత్సరంలో అది 75 వేల వరకు వెళ్లే అవకాశం ఉందన్నారు. కేన్సర్‌కు చికిత్స పొందాలంటే రాష్ట్రంలో ఎంఎన్‌జె, నిమ్స్‌లో మాత్రమే అవకాశం ఉందన్నారు. కేన్సర్‌పై పోరాడిన నూరి దత్తాత్రేయను సలహాదారులుగా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. అదేవిధంగా ప్రతి జిల్లాకు ఒక మొబైల్ స్క్రీనింగ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ వాహనాలు ప్రతి గ్రామానికి వెళ్లి కేన్సర్ పరీక్షలు చేసి నిర్ధారణ చేస్తాయని వివరించారు.

నర్సింగ్ విద్యార్థులకు ఫారిన్ లాంగ్వేజీలో విద్యా బోధన

రాష్ట్రంలోని నర్సింగ్ కాలేజీల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఫారిన్ లాంగ్వేజీలో విద్యా బోధన చేయనున్నట్టు మంత్రి దామోదర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 3 వేల మంది నర్సింగ్ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని, ఇప్పటి వరకు రాష్ట్రంలో లక్షా 70 వేల మంది రిజిస్టర్ట్ నర్సులు ఉన్నారని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలయిన జర్మనీ, ఇంగ్లీష్ భాషలతో సహా పలు భాషల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్ల్యూ)తో వైద్యారోగ్యశాఖ ఒప్పందం చేసుకుందన్నారు. ఈ శిక్షణతో నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్‌చోంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర కుమార్, అడిషనల్ డిఎంఇ డాక్టర్ వాణి, ఎంఎన్‌జె కాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వైద్య కళాశాల అధ్యాపకులు, జిజిహెచ్ సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిఎం జన్మన్ నిధులు విడుదల చేయాలి

- మాజీ ఎంపి, టిఎజిఎస్ అధ్యక్షులు మిడియం బాబూరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశం లోని పివిటిజి తెగల అభివృద్ధి, ఇండ్లు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్ర స్థాయిలో వాటికి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎంపి, టిఎజిఎస్ అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. పిఎం జన్మన్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో టిఎజిఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ సంస్కృతి సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ అంతరించి పోతున్న పివిటిజి తెగల భాష, సంస్కృతిని పరిరక్షించాలని, కేంద్ర బడ్జెట్‌లో పిఎం జన్మన్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సంస్కృతిపై సావనీర్ తేవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షులు సున్నం గంగ, రవి కుమార్, కారం పుల్లయ్య పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన నార్సింగి టౌన్ ప్లానింగ్ అధికారి

- వెయ్యి గజాల ప్లాట్‌కు ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్


మణిహారికను విచారిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపాలిటీలో ఎసిబి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక రూ.4 లక్షలు లంచం తీసుకుంటూ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. ఓ ఇంటికి ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ కోసం అధికారి లంచం డిమాండ్ చేయగా.. ఇంటి యాజమాని ఎసిబిని ఆశ్రయించాడు. బాధితుని నుంచి లంచం తీసుకుంటుండగా.. ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిరేవుల గ్రామానికి చెందిన వినోద్ అనే వ్యక్తి వెయ్యి గజాల ప్లాట్ ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ కోసం నార్సింగి మున్సిపల్ అధికారులను సంప్రదించాడు. అప్పటికే ప్రభుత్వానికి రూ.6లక్షలు చెల్లించాడు. క్లియరెన్స్ కోసం ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి మణిహారిక బాధితుడిని రూ.10లక్షలు డిమాండ్ చేసింది. అతను అంత ఇవ్వలేనని చెప్పడంతో రూ.5లక్షలు ఇవ్వాలని కోరింది. అయితే రూ.4లక్షలు ఇస్తానని చెప్పాడు. అనంతరం బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో మణిహారికకు రూ.4లక్షలు ఇస్తుండగా.. ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. విలువైన డాక్యుమెంట్లు, ఇతర పత్రాలను పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ అధికారి నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. ఈ అవినీతిలో ఎవరెవరు ఉన్నారనే కోణంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. మణిహారికను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు దృష్టికి తీసుకురావాలని ఎసిబి డిఎస్‌పి సూచించారు. నార్సింగి మున్సిపాలిటీలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని, కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల అండదండలతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సందర్శకులకు సకల సౌకర్యాల కల్పన

- మేడారం జాతరపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- రూ.150 కోట్లతో సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాట్లు
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



మంత్రి సీతక్కకు వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని సందర్శకులకు సకల సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో జరుగునున్న పనులను పరిశీలించడానికి వారంలోగా ముఖ్యమంత్రి మేడారంలో పర్యటిస్తారని తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా తాడ్వాయి(ఎస్‌ఎస్) మండలం మేడారం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న విఐపి పార్కింగ్ రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్, హరిత హోటల్ తదితర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర, ఎస్‌పి డాక్టర్ శబరిష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బానోతు రవిచంద్రతో కలసి మంత్రి పరిశీలించారు. అనంతరం మేడారంలోని ఐటిడిఎ సమావేశం హాల్లో అమ్మవార్ల పూజారులు, అన్ని శాఖల అధికారులతో శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర-2026పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. యాత్రికుల సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.150 కోట్లు కేటాయించిందని, ఆయా శాఖల అధికారులు 100 రోజుల నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గద్దెల ప్రాంతంలో పూజారుల మనోభావాలు దెబ్బ తినకుండా వారి సూచనల మేరకు నూతన హంగులతో శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేయాలని తెలిపారు. మేడారం గ్రామస్తులు, పూజార్ల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పండుగగానే కాకుండా మరో కుంభమేళా తరహాలో జరగనున్న జాతరకు సామాన్య పౌరుని నుంచి రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి ముఖ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నదని అన్నారు. విఐపిలకు ఇబ్బందులు రాకుండా విమానాలు సైతం దిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసారి చేపట్టనున్న పనులు శాశ్వతంగా ఉండేలా నాణ్యతగా జరిగేలా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వనదేవతల ప్రాంతంలో రాజకీయాలు చేసే ఏ రాజకీయ నాయకుడు ఎదగలేదని, రానున్న మహా జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులూ ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్లేచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఈ శివనాగిరెడ్డి, అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, పూజారుల సంఘం అధ్యక్షులు జగ్గారావు, ఇఒ వీరస్వామి, ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

54 గౌడ కుటుంబాల బహిష్కరణ

- జైలు శిక్ష పడుతున్నా మారని విడిసి తీరు
- కల్లుసీసా ధర రూ.3 పెంచుతామన్నందుకు ఆంక్షలు పెట్టిన ఆర్మూర్ మండలం పిప్రీ విడిసి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విడిసిల తీరు ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పోలీస్‌బాస్ సైతం వీటి ఆగడాలపై కఠినంగా వ్యవహరిస్తూ పెండింగ్ కేసులకు త్వరగతిన శిక్షలు పడేలా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల ఓ విడిసి సభ్యులకు జైలు శిక్ష సైతం పడింది. అయినా విడిసిల్లో మార్పు రావట్లేదు. తాజాగా కల్లు రేటు పెంపు విషయంలో ఏకంగా 54 గౌడ కుటుంబాలను బహిష్కరించిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం పిప్రిలో మంగళవారం వెలుగుజూసింది. తమపై విడిసి ఆంక్షలు పెట్టి బహిష్కరించిందని గౌడ కులస్తులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లు విక్రయిస్తుండగా.. పెరిగిన ధరలకు అనుగుణంగా గిట్టుబాటు కావడం లేదని.. సీసా ధర రూ.12 ఉండగా.. అదనంగా మూడు రూపాయలు పెంచి 15 రూపాయలు చేస్తామన్నందుకు విడిసి బహిష్కరించారు. తెల్లకాగితంపై సంతకాలు పెట్టి ఇవ్వాలని.. తాము చెప్పినట్టు వినాలని విడిసి హుకుం జారీ చేసింది. గ్రామంలోని దుకాణాల్లో గౌడ కులస్తులకు సరుకులు ఇవ్వకుండా, ఆటోల్లోకి ఎక్కించుకోకుండా ఆంక్షలు పెట్టి బహిష్కరించారు. పలువురు గౌడ కులస్తులు హోటళ్లు, కిరాణ దుకాణాలు, టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తుండగా.. వారి వద్ద గ్రామస్తులెవరూ కొనుగోలు చేయవద్దని హుకుం జారీ చేశారని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము కల్లు విక్రయిస్తున్నందుకు ఏడాదికి రూ.10లక్షలు విడిసికి ఇస్తున్నామని, అయినా తమను బహిష్కరించి మానసిక క్షోభకు గురి చేస్తున్న విడిసిపై చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబాలు ఫిర్యాదు చేశాయి. ఇటీవల జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గంలోని ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తుల బహిష్కరణ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. గ్రామాల్లో రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్న విడిసిల ఆగడాలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు, జిల్లా న్యాయ సేవా సంస్థ కొరడా ఝుళిపిస్తున్నా మార్పు రావడం లేదని.. కఠిన చర్యలు తీసుకుంటేనే విడిసి ఆగడాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని బాధితులు వాపోతున్నారు.

అనురాగ్ యూనివర్సిటీతో ఎక్స్‌డిలింక్స్ ఏరోస్పేస్ జట్టు

హైదరాబాద్ :అంతరిక్ష పరిశోధనలు, ఆవిష్కరణల్లో తాము ముందంజలో నిలవాలనే లక్ష్యంతో అనురాగ్ యూనివర్సిటీ కీలక ముందడుగు వేసినట్లు పేర్కొంది. ఉపగ్రహ రంగంలో అద్భుత విజయాలు సాధిస్తున్న హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష సాంకేతిక స్టార్టప్, 'ఎక్స్‌డిలింక్స్ ఏరోస్పేస్ ల్యాబ్స్'తో సహకరించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొంది. ఈ మేరకు రెండు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నాయి. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, యూనివర్సిటీ నిర్మించే ఉపగ్రహాల అభివృద్ధి ప్రయోగానికి నిపుణుల మార్గదర్శనం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సహకారం తమ విద్యా సంస్థకు ఒక మైలురాయి వంటిదని అనురాగ్ యూనివర్సిటీ స్ట్రాటజీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అనురాగ్ పల్లా పేర్కొన్నారు.

12, 13 తేదీల్లో ఏఐపై షాద్‌నగర్‌లో జాతీయ సదస్సు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈనెల 12,13 తేదీల్లో షాద్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ, పిజి మహిళా కళాశాలలో కృత్రిమ మేధా (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)పై రెండు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్‌తో కలిసి మంత్రి అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సదస్సులో గిరిజన సంక్షేమ కార్యదర్శి సీతాలక్ష్మి, అడిషనల్ సెక్రటరీ పి.మాధవిదేవి, డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ కే.వేణుగోపాల్, గిరిజన గురుకుల ఒఎస్‌డి నటరాజ్ తదితరులు పాల్గొంటారని షాద్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ, పిజి మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీతా తెలిపారు.

ఫార్ములా-ఈ కేసు ఒక లొట్టపీసు కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్ములా-ఈ కేసు ఒక లొట్టపీసు కేసు అని కెటిఆర్ కొట్టిపారేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌కి ఫార్ములా-ఈ రేసు తీసుకురావడానికి తాను అన్ని ప్రయత్నాలు చేశానని చెప్పారు. ఈ రేసు కోసం ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చాననీ, ఆ డబ్బులు నేరుగా నిర్దేశిత ఖాతాలోకి చేరాయని తెలిపారు. ఇందులో రూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదనీ, ప్రతి రూపాయికి లెక్క ఉందనీ, అలాంటప్పుడు అవినీతి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రాసిక్యూషన్ చేసినా, ఛార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, గ్యారెంటీలపై పోరాడుతామని కెటిఆర్ పునరుద్ఘాటించారు. 'సిఎం, నేను ఇద్దరం కలిసి లై డిటెక్టర్ పరీక్షను టివి ఛానల్ ముందు ఎదుర్కొందాం,' అని సవాల్ విసిరారు. గతంలో రూ.50 లక్షల నోట్ల కట్టలతో కెమెరాలకు అడ్డంగా దొరికిన రేవంత్ రెడ్డి గురించి కూడా ప్రజలు తెలుసుకుంటారని విమర్శించారు. ఈ పరీక్షతో ఎవరు ఏమిటో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి ప్రభుత్వం ఫార్ములా-ఈ కేసును ముందుకు తెచ్చిందని కెటిఆర్ ఆరోపించారు. తాము మాత్రం ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్ సమస్యలపై

- మీడియా వర్క్‌షాప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజెఎం) సంయుక్తంగా ఈనెల 16న 'హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్' అంశాలపై ప్రత్యేక మీడియా వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమం మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించేలా, ఈ నేరాల తీవ్రతను అర్థం చేసుకోవడం, బాధితుల పట్ల ప్రదర్శించే వైఖరి లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌లో 'హ్యూమన్ ట్రాఫికింగ్, బాండెడ్ లేబర్' బాధితుల పునరావాసం, న్యాయపరమైన, సమాజపరమైన మద్దతు అంశాలపై నిపుణులు ప్రసంగించనున్నారు. మీడియా పాత్ర, బాధితుల గౌరవాన్ని కాపాడుతూ సమగ్ర కథనాలను తయారు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. సివిల్ సొసైటీ ప్రతినిధులు, న్యాయ నిపుణులు, అనుభవజ్ఞులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ వేదిక జర్నలిస్టులు, ఎడిటోరియల్ బృందాలకు అత్యంత ఉపయోగకరంగా ఉండనుంది. తెలంగాణ మీడియా అకాడమీ ఈ సమస్యపై జర్నలిజానికి అవసరమైన అవగాహనను పెంచే లక్ష్యంతో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూ వస్తోంది. ఐజెఎం సంస్థ ఈ రంగంలో దేశవ్యాప్తంగా చేసిన అవిశ్రాంత సేవను మనందరికీ పరిచయం చేస్తూ, న్యాయ వ్యవస్థతో కలిసి పని చేస్తుంది.ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనదలచిన మీడియా ప్రతినిధులు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ పేరు, సంస్థ పేరు, హోదా, పని చేస్తున్న ప్రదేశంతో పాటు తమ మొబైల్ నెంబర్‌ను ఈ కార్యాలయ మేనేజర్ సెల్ నెంబర్ 7093600977కు వాట్సాప్ ద్వారా రిజిష్టర్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నాము. ముందుగా నమోదు చేసుకున్న మొదటి 70 మంది జర్నలిస్టులకు మాత్రమే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు అనుమతించబడుతుందని మీడియా అకాడమీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రజావాణిలో 311 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు 311 దరఖాస్తులు సమర్పించారు. వీటిలో హౌసింగ్‌కు సంబంధించినవి 85 ఉండగా, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన 76, రెవెన్యూ శాఖకు సంబంధించిన 50 దరఖాస్తులున్నాయి. ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు వచ్చాయి. ప్రవాసీ ప్రజావాణిలో మూడు వినతిపత్రాలను అధికారులు స్వీకరించారు.

తెలంగాణలో విద్యాభివృద్ధికి అండగా నిలవండి

- నిర్మలా సీతారామన్‌కు రేవంత్‌రెడ్డి వినతి



సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న కృషికి మద్దతు ఇవ్వాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతంగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ తరగతుల పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో నార్త్ బ్లాక్‌లోని ఆమె కార్యాలయంలో ముఖ్యమంత్రి మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మించనున్నట్లు సిఎం తెలిపారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని... మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని... 2.70 లక్షల మంది విద్యార్థులకు ఈ పాఠశాలల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయమవుతుందని వివరించారు. అలాగే రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.తొమ్మిది వేల కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు ఎఫ్ఆర్‌బిఎం పరిమితి నుంచి మినహాయించాలని కోరారు. గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చిందని... వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిన నేపథ్యంలో వాటి రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించారు.

నితిన్ గడ్కరీ తో భేటీ

జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రీజినల్ రింగు రోడ్డుకు (నార్త్ పార్ట్) సంబంధించి 90 శాతం భూ సేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి ఆర్థిక, క్యాబినెట్ అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డిపిఆర్‌కు అనగుణంగా రీజినల్ రింగు రోడ్డు (సౌత్ పార్ట్)కు అనుమతులు ఇప్పించాలన్నారు. రావిర్యాల-ఆమన్‌గల్-మన్ననూర్ రహదారిని నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా నిర్మించాలని కోరారు. మన్ననూర్-శ్రీశైలం (ఎన్‌హెచ్ 765) నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. హైదరాబాద్-మంచిర్యాల మధ్య నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని జాతీయ రహదారిగా మంజూరు చేయాలని, హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారికి అనుమతి ఇవ్వాలని కోరారు.



ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులను వాహనం ఎక్కిస్తున్న పోలీసులు

కరీంనగర్‌లో హైటెన్షన్

- కేంద్ర మంత్రి 'బండి' క్యాంపు ఆఫీస్ ముట్టడికి సిపిఐ యత్నం
- పోలీసులకు, సిపిఐ శ్రేణులకు మధ్య తోపులాట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం హైటెన్షన్ నెలకొంది. రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, సిపిఐ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ యూరియా విధానం వల్ల రాష్ట్ర రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని రైతులు యూరియా కోసం అల్లాడుతున్నా స్థానిక ఎంపి, కేంద్ర మంత్రి బండి సంజయ్ మౌనంగా ఉండటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటాను కేంద్రం ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు అత్యధికంగా యూరియా అందిస్తూ తెలంగాణ లాంటి రాష్ట్రాలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. యూరియా అందక పంటలు ఎర్రబడి ఎదగడం లేదని, తక్షణమే కేంద్రం రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోని బిజెపి మంత్రులను, ఎంపీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెం లక్ష్మి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, బావండ్లపెల్లి యుగేందర్, బీర్ల పద్మ, కొట్టె అంజలి, రామారావు వెంకటేష్ పాల్గొన్నారు.

17న ప్రజాపాలన దినోత్సవం

- విస్తృత ఏర్పాట్లు చేయండి
- అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డిజిపి జితేందర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజి శివధర్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జిఎడి కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొంటారని వివరించారు. గన్‌పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జిహెచ్‌ఎంసి కమిషనర్ నోడల్ అధికారిగా ఉంటారనీ, గన్‌పార్క్‌కు ఫ్లోరల్ డెకరేషన్‌తోపాటు, షామియానా తదితర ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, విగ్రహాలు, పర్యాటక ప్రదేశాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని అన్నారు. పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి తగు ఏర్పాట్లను చేయాలని రోడ్లు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిదాయకంగా జరిగేలా చూడాలని అధికారులను సిఎస్ ఆదేశించారు. నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు తగు తాగునీరు, శానిటేషన్ ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వివిఐపిలతో పాటు ప్రజాప్రతిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ఫైర్ సర్వీసుల డిజి నాగిరెడ్డి, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, ప్రొటోకాల్ శాఖ డైరెక్టర్ శివలింగయ్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక, ఎస్‌పిడిసిఎల్ ఎండి ముషారఫ్, జలమండలి ఎమ్‌డి అశోక్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

యువతిని కాపాడిన సిఎఆర్ హెడ్ కానిస్టేబుల్

- శ్రీధర్ వర్మకు హెచ్‌ఆర్‌సి అభినందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవత్వంతో వ్యవహరించిన సిఎఆర్ కానిస్టేబుల్‌కు తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టిఎస్‌హెచ్‌ఆర్‌సి) ఛైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ప్రశంసించారు. గత వారం నగరంలో కురిసిన భారీ వర్షాల సమయంలో ఒక యువతిని రక్షించిన హైదరాబాదు సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ (సిఎఆర్) హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ వర్మ ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన సేవలను ప్రశంసిస్తూ జస్టిస్ షమీమ్ అభినందన పత్రం అందజేశారు. శ్రీధర్ వర్మ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు పైలట్ కమ్ ఎస్కార్ట్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఆగస్టు7న సాయంత్రం హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా బంజారాహిల్స్ రహదారులు నడుము లోతు వరద నీటితో మునిగిపోయాయి. ఆ సమయంలో బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.3 వద్ద బస్టాప్‌లో ఒంటరిగా నిలబడి భయాందోళనలకు లోనైన 22 ఏళ్ల యువతి నైనికను శ్రీధర్ వర్మ గమనించారు. ఆస్ట్రేలియాలో ఎంబిఎ చదువుతున్న నైనిక రామంతపూర్‌లో కుటుంబ సభ్యులను కలుసుకోవడానికి నగరానికి వచ్చింది. తన అన్న వదిలి వెళ్ళిన తర్వాత పెరుగుతున్న వరదలో ఇరుక్కుపోయింది. నీటి భయం (హైడ్రోఫోబియా)తో విలవిలలాడింది. మొబైల్ ఫోన్ పని చేయకపోవడంతో తల్లిదండ్రులను సంప్రదించలేని పరిస్థితిలో చిక్కుకుంది. ఈ సమయంలో శ్రీధర్ వర్మ నడుము లోతు నీటిలోకి వెళ్ళి, ఆమెకు తన జెర్కిన్ ఇవ్వడంతో పాటు ధైర్యం చెప్పి, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రయాణ సౌకర్యాలు లభించకపోవడంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఆయన స్వయంగా నైనికను వానలతో ముంచెత్తిన రహదారులను దాటుకుంటూ వనస్థలీపురంలోని ఆమె ఇంటికి ఆ రాత్రి తీసుకెళ్లి తల్లి, చెల్లెలు వద్దకు క్షేమంగా చేర్చారు. ఈ సంఘటన పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించింది. దీనిపై జస్టిస్ షమీమ్ అక్తర్ స్పందిస్తూ, శ్రీధర్ వర్మ సేవను విధి నిర్వహణకు మించి మానవత్వం, కర్తవ్యబద్ధతకు ప్రతీకగా అభినందించారు. ఆయన చూపిన నిస్వార్థ సేవ ఒక బాధలో ఉన్న పౌరుడి సురక్షితత్వం, గౌరవాన్ని కాపాడడమే కాకుండా, పోలీసింగ్, మానవ హక్కుల పరిరక్షణలోని అసలు స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆయన అభినందించారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న సిఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీధర్ వర్మ

రేవంత్ రెడ్డి నోరు విప్పితే అబద్ధాలే

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి నోరు విప్పితే అబద్ధాలాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. అరిచినంత మాత్రాన అబద్ధాలు నిజాలు కావని అన్నారు. రేవంత్ రెడ్డి మాటలు వింటే అబద్ధం కూడా ఆత్మహత్య చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. రిజర్వాయర్ల కెపాసిటీ పెంచుకోవాలంటూ గతంలో సిబ్ల్యూసి మల్లన్నసాగర్ డిపిఆర్‌ను తిరస్కరించిందని గుర్తుచేశారు. సాగునీటి అవసరాల కోసం కెసిఆర్ 50 టిఎంసిల మల్లన్నసాగర్ నిర్మిస్తే, అది నిర్మించొద్దని రేవంత్ రెడ్డి 48 గంటల దీక్ష చేశారని గుర్తుచేశారు. దాని నిర్మాణానికి ప్రజల సమ్మతి తీసుకున్నామని తెలిపారు. మూసీలో మాత్రం 300 ఇళ్లను కూలగొట్టిన రేవంత్ రెడ్డి వారికి కెసిఆర్ నిర్మించిన డబుల్ బెడ్ రూంలు ఇచ్చి నగదు సాయం చేయలేదని విమర్శించారు. మల్లన్నసాగర్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి 250 గజాలతో సొంత ఇంటిని నిర్మించి ఇచ్చామని, రూ.2.5 లక్షల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ఇచ్చినట్టు తెలిపారు. మూసీ నిర్వాసితులకు 2013 చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో మంచినీటి కోసం రూ.7 వేల కోట్లను ఖర్చు చేసినట్టు తెలిపారు. 2008లో కాంగ్రెస్ ప్రారంభించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ఏడేళ్లయినా పూర్తి కాకుంటే, బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో పూర్తి చేసినట్టు తెలిపారు. కృష్ణా ఫేజ్ 4 పనులను కూడా పూర్తి చేసి ఆ నీళ్లను కూడా హైదరాబాద్ తెచ్చింది కెసిఆర్ అని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ.1,600 కోట్లు ఖర్చు చేసి 56 రిజర్వాయర్లు, 2,600 కిలోమీటర్ల పైప్ లైన్లు వేసి, ఒఆర్ఆర్ ఫేస్ వన్, ఫేస్ టూలో రూ.2,000 కోట్లు ఖర్చు చేసి ఒహెచ్‌ఎస్ఆర్ పైపులైన్లు వేసినట్టు తెలిపారు. కెసిఆర్ కాళేశ్వరంతో పాటు 50 టిఎంసిలతో మల్లన్నసాగర్ నిర్మించినందువల్లే రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు నీళ్లు తేగలుగుతున్నారని హరీశ్ రావు తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్లకు అగ్రిమెంట్ ఉంటే, గ్రావిటీ ద్వారా నీళ్లు తెచ్చి చూపించాలని హరీశ్ రావు సవాల్ విసిరారు.

కెసిఆర్ హయాంలోనే గురుకులాలకు మహర్దశ

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గురుకులాల విషయంలో సిఎం, మంత్రులు అసహనంతో మాట్లాడుతున్నారనీ, కెసిఆర్ హయాంలోనే వాటికి మహర్దశ ఏర్పడిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ చిరుమళ్ల రాకేష్ కుమార్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ గురుకులాల నిర్వహణను గాలికొదిలేసి ఇప్పుడు కేసీఆర్‌పై నెపం మోపడం తగదని హితవు పలికారు. గురుకులాల్లో ప్రతి రోజూ ఏదో ఓ ఘటన జరుగుతోందని తెలిపారు. లక్ష్మణ్ కుమార్ నిన్న గాక మొన్న మంత్రి అయ్యారని, ఆయన అహగాహన లేమితో మాట్లాడుతున్నారని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే గురుకులాల సంఖ్యను 1,024 కు పెంచామని గుర్తు చేశారు. తద్వారా ఆరులక్షల మంది విద్యార్థులకు విద్యనందించామని తెలిపారు.



సెంటర్‌ను ప్రారంభించిన నెమెట్‌షేక్ గ్రూప్ సభ్యులు

హైదరాబాద్‌లో నెమెట్‌షేక్ గ్రూప్ కొత్త సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, నిర్మాణ రంగంలోని నెమెట్‌షేక్ గ్రూపు హైదరాబాద్‌లో తన ఆధునిక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మంగళవారం దీనిని ఐఎస్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జెఎ చౌదరి, నెమెట్‌షెక్ సిఎఫ్ఒ లూయిస్ ఓఫ్వర్‌స్ట్రోమ్ లాంచనంగా ప్రారంభించారు. భారత్‌లో నెమెట్‌షెక్ వ్యూహాత్మక విస్తరణలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని లూయిస్ పేర్కొన్నారు. ప్రస్తుత కార్యకలాపాలకు తోడు ఈ కొత్త విస్తరణ ఆధునిక పరిశోధన, వినూత్న సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, గ్లోబల్ టీమ్‌లతో సహకారం కోసం ఒక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. 250 మందికి పైగా పూర్తి స్థాయి సిబ్బందిని కలుపుకునే సామర్థ్యం కలిగిన ఈ సదుపాయం, భారతదేశంలోని అత్యంత చురుకైన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లో నెమెట్‌షెక్ తన ఉనికిని బలపరచాలనే సంకల్పాన్ని మరింత స్పష్టంగా తెలియజేస్తుందన్నారు.



మాట్లాడుతున్న సంజనా షా

నగరంలో 13, 14న బిఎన్ఐ ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో

- 200 పైగా సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్

అతిపెద్ద వ్యాపార నెట్‌వర్కింగ్, వ్యాపార రిఫరల్ సంస్థ అయిన బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 13, 14వ తేదీలలో శంషాబాద్ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో 'బిఎన్ఐ గోనాట్ 2025' పేరుతో ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా మాట్లాడుతూ.. రెండు రోజుల ఈ ప్రదర్శనను పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించనున్నారని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో, సెమినార్‌గా నిలువనుందన్నారు. ఇందులో బేకింగ్, ఫోటోగ్రఫీ, ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఈవెంట్ స్టైలింగ్, అడ్వర్టైజింగ్, ఫుడ్ ఇన్నోవేషన్ మొదలైన విభాగాలు ఉంటాయన్నారు. ఈ ఎక్స్‌పోలో 200పైగా ఎంఎస్ఎంఇలు తమ ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నారని తెలిపారు. 121 కాన్‌క్లేవ్ వ్యవస్థాపకులు తమ అనుభవాలు పంచుకోవడానికి ప్రత్యేక వేదికను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఐ హైదరాబాద్ ఏరియా డైరెక్టర్ టి.సతీష్ కుమార్, ఆదిత్య కెడియా రియల్టర్స్ ఎల్ఎల్‌పి విష్ణు కుమార్ కెడియా, ఒపిపిఇఐఎన్ ఎండి అల్లూరి శ్రీనివాస్ రాజు, పోకర్ణా లిమిటెడ్ ఎండి రాహుల్ జైన్, లియో పాకర్స్ అండ్ మూవర్స్ శ్రద్ధా షా తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన గురుకుల డార్మెటరీ హాల్

- ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలు
- సంగారెడ్డి జిల్లాలో ఘటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



కూలిపోయిన డార్మెటరీ

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాలలో గోడకూలి డార్మెటరీ హాల్ కూలిపోయిన ఘటనలో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఘటనా స్థలాన్ని సందర్శించి ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను రప్పించి సహాయక చర్యలు చేపట్టారు. డార్మెటరీ కూలిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలోనే ఉండటం వల్ల వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అటుగా వెళుతున్న ముగ్గురు విద్యార్థులకు మాత్రం స్వల్ప గాయాలు కాగా వారిని జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 601 మంది విద్యార్థులు చదువుతున్నారు. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రావిణ్య గురుకుల పాఠశాలకు చేరుకుని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మునిపల్లి మండలం తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ పాత డార్మిటరీ బ్లాక్ కూలిన ఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని కలెక్టర్ తెలిపారు. మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాలలో 1984లో నిర్మించిన పాత హాస్టల్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం గోడ కూలింది. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలో ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఆ సమయంలో హాస్టల్ భవనం పక్కగా వెళుతున్న ముగ్గురు విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయని, వారికి జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలో ఎన్‌డిఆర్ఎఫ్ బృందం కూలిన గోడ, డార్మెటరీ మట్టి తొలగింపుతో పాటు శిథిలాల కింద ఉన్న విద్యార్థుల వస్తువులను సురక్షితంగా బయటకు తీసినట్టు తెలిపారు. విద్యార్థులకు తాత్కాలికంగా అందుబాటులో ఉన్న తరగతి గదులు, హాస్టల్ గదుల్లో వసతి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇంజనీరింగ్ శాఖ (ఇడబ్ల్యూఐడిసి) అధికారులు సంఘటనా స్థలంలో పాడైన భవనాలను కూల్చివేయడం, వినియోగించటానికి వీలుగా ఉండే గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. రాత్రి సమయంలో పనులు కొనసాగేందుకు తాత్కాలికంగా లైటింగ్ కూడా ఏర్పాటు చేశారని అన్నారు. గురుకుల పాఠశాలకు నూతన హాస్టల్ భవన నిర్మాణం కోసం రూ .7 కోట్లతో ప్రభుత్వానికి ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ప్రస్తుతం పాఠశాలల్లో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, విద్యార్థుల భద్రతకు ఎలాంటి సమస్యలు లేవని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు.

సూర్యాపేటలో అమట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించండి

- సిఎస్ రామకృష్ణారావుకు ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లాలో 16 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అమట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులను ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణారావును మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్, ఉపాధ్యక్షులు పద్మశ్రీ కలిసి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లాలో వైద్యఆరోగ్య శాఖ, అటవీ శాఖ, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖ, నీటిపారుదల శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, బిసి సంక్షేమం వంటి 16 శాఖల్లో సుమారు 1,400 మంది ఉద్యోగులో అమట్‌సోర్సింగ్ విధానంలో గత 20 ఏండ్లుగా పనిచేస్తున్నారని వివరించారు. వారికి కొనసాగింపు ఉత్తర్వుల్లేని కారణంగా ఏప్రిల్ నుంచి వేతనాలను చెల్లించడం లేదని తెలిపారు. కొత్త కాంట్రాక్టులు ఖరారు చేయకపోగా పాత వారినైనా రెన్యూవల్ చేయకపోవడంతో వారి జీవితాలు దుర్భరంగా మారాయని పేర్కొన్నారు. కుటుంబాన్ని పోషించుకోలేక అప్పుల బారిన పడుతున్నారని, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. నెలనెలా జీతం రాకపోవడం వల్ల ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లింపులు కూడా నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాని వల్ల ఇఎస్ఐ కార్డులపై వైద్య సేవలు కూడా అందట్లేదని తెలిపారు. ఈ అమట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే కొనసాగింపు ఉత్తర్వులిచ్చి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.